వచ్చేస్తున్నారు.. స్టూడెంట్ ట్రాఫిక్ వలంటీర్లు

నగర వ్యాప్తంగా.. ప్రత్యేక శిక్షణతో 300 మంది విద్యార్థులు సిద్ధం
తొలిసారిగా రంగంలోకి విద్యార్థినులు

ఖైరతాబాద్ కూడలిలో ట్రాఫిక్ విద్యార్థి వలంటీర్‌లకు విధులపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

మియాపూర్, జూన్ 26: నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్‌ను కట్టడి చేసేందుకు పోలీసు యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తున్నది. నగర వ్యాప్తంగా 250కి పైగా ట్రాఫిక్ సిగ్నళ్లు.. పదుల సంఖ్యలో పాదచారుల క్రాసింగ్‌లు.. కొత్తగా ఫుట్ ఓవర్ వంతెనలు సైతం ఉన్నాయి. వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగానికి తోడు ఇటీవలి కాలంలో వివిధ రంగాలకు చెందిన యువతకు శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ వలంటీర్లుగా సిద్ధం చేసి, వారి సేవలను సైతం మూడు కమిషనరేట్ల పరిధిలోని సిగ్నళ్ల వద్ద వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు ఐటీ రంగానికి చెందిన ఉద్యోగులను ఇందుకోసం ఎంపిక చేసి గోషామహల్‌లో ప్రత్యేక శిక్షణను ఇచ్చి, ట్రాఫిక్ నియంత్రణకు ఎలా వ్యవహరించాలో వివరించి క్షేత్రస్థాయిలో సేవలు తీసుకుంటున్నారు.

అయితే, తొలిసారిగా నగరంలో విద్యార్థులు ట్రాఫిక్ వలంటీర్లుగా తమ సేవలను అందించేందుకు సిద్ధమయ్యారు. సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని పలు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఉన్న 300 మంది విద్యార్థినీ విద్యార్థులను ట్రాఫిక్ వలంటీర్లుగా ఎంపిక చేసి, మూడు రోజులుగా శిక్షణను అందిస్తున్నారు. తాజాగా, శిక్షణ పొందిన 300 మందిలో సుమారు 150 మంది విద్యార్థినులు కూడా ఉండటం విశేషం. ఇప్పటి వరకు ఐటీ రంగంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులు ట్రాఫిక్ వలంటీర్లుగా శిక్షణ పొంది సేవలను అందిస్తుండగా.. తొలి సారిగా విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్ వలంటీర్లుగా శిక్షణ ఇచ్చి రంగంలోకి దింపుతున్నారు. ఇందుకు గోషామహల్‌లోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ హరీశ్ మూడు రోజులుగా 300 మంది విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్ విధులపై తగిన శిక్షణ అందించారు. శిక్షణ పొందిన విద్యార్థుల జాబితాలను ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లకు పంపిస్తామని, అక్కడి ట్రాఫిక్ సీఐలు స్టూడెంట్ వలంటీర్లను సమన్వయం చేసుకుని ప్రతి శని, ఆదివారాల్లో వారి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకుంటారని ఇన్‌స్పెక్టర్ హరీశ్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో వలంటీర్‌గా సేవలందిస్తా..

ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ విభాగం పోలీసులు ఎంతో శ్రమిస్తున్నారు. వాళ్ల కృషికి హ్యాట్సాఫ్. కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పని చేస్తున్న నేను ట్రాఫిక్ వలంటీరుగా ఎంపికై శిక్షణ పొందడం ఎంతో సంతోషాన్ని ఇస్తున్నది. ట్రాఫిక్ వలంటీర్‌గా ట్రాఫిక్ విభాగం సిబ్బందితో కలిసి నా వంతుగా నియంత్రణకు కృషి చేస్తా.

- నీలిమ, శిక్షణ పొందిన విద్యార్థిని, రిషి మహిళా కళాశాల

మంచి శిక్షణను ఇచ్చారు..

ట్రాఫిక్ విధుల నిర్వహణపై గోషామహల్‌లోని శిక్షణ కేంద్రంలో అధికారులు ఎంతో చక్కని శిక్షణను అందించారు. సిగ్నళ్ల వద్ద పాదచారుల క్రాసింగ్‌లు, ఫుట్ ఓవర్ వంతెనల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, పాదచారులను క్షేమంగా రోడ్డును దాటించేందుకు ఎలా వ్యవహరించాలో వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను వలంటీరుగా క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తా.

- నిఖిత, ట్రాఫిక్ వలంటీరు, రిషి మహిళా కళాశాల

ప్రజా సమస్యలు పట్టించుకోరా..?

జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

చార్మినార్, జూన్ 26 : 'ఏయ్.. ఎంత కాలం పనులు కొనసాగిస్తుంటారు.. ప్రజా సమస్యలను పట్టించుకోరా..? ప్రజా ప్రతినిధులు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నా పట్టించుకోరా..?' అంటూ.. జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ అధికారులపై బహదూర్‌పుర ఎమ్మెల్యే ముబీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బహదూర్‌పుర ఫ్లై ఓవర్ సమీపంలోని నాలా విస్తరణ పనులను పర్యవేక్షించేందుకు జీహెచ్ఎంసీ విభాగం ప్రాజెక్ట్ అధికారులు బుధవారం ఆయా ప్రాంతాలను సందర్శించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ముబీన్ వారు పర్యటిస్తున్న ప్రాంతానికి చేరుకొని అధికారుల తీరుపై మండిపడ్డారు. 'నాలా విస్తరణ కోసం నాలుగేండ్ల కిందట టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.. ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు ప్రజలకు ఎలాంటి మేలు చేస్తారు' అని అన్నారు. ఎమ్మెల్యే ముబీన్‌కు స్థానిక పరిస్థితులను తెలియజేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నా వారి మాటలను పట్టించుకోకుండా అధికారుల తీరుపై ఆగ్రహించారు.

అనుమతులు తీసుకున్నాం..

'నాలా విస్తరణ పనుల కోసం కావాల్సిన అనుమతులన్నీ తీసుకున్నాం. నాలా 8 మీటర్ల విస్తరణలో భాగంగా కొన్ని ప్రైవేట్ ఆస్తులను సేకరించాల్సి ఉన్నది. కొన్ని ఆస్తులు ఇప్పటికే గుర్తించి వారికి నష్ట పరిహారాన్ని సైతం అందించాం. ఈ నాలా విస్తరణకు రూ.13 కోట్లు మంజూరయ్యాయి. ప్రైవేట్ ఆస్తుల సేకరణలో భాగంగా జీహెచ్ఎంసీ నుంచి కొంత నిధులు అందని పక్షంలో నాలా విస్తరణ పనుల్లో జాప్యం ఏర్పడుతున్నది. నాలా విస్తరణ పనులను పూర్తి చేస్తాం' అని ఓ ప్రాజెక్ట్ ఉన్నతాధికారి వివరణ ఇచ్చారు.

అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించుకోవాలి

హిమాయత్‌నగర్: దేశంలోని నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం శాపంగా మారిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ ఆరోపించారు. దేశ రక్షణ రంగాన్ని ప్రైవేట్ పరం చేసే అగ్నిపథ్ పథకాన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ విధానాల వల్ల సైనికుల త్యాగాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, నగర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, నాయకులు షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, అనిల్‌కుమార్, బాలు, మహేశ్, మురళి, కిరణ్, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు కృష్ణారావు, సీతక్క తదితరులు

మత్తుకు దూరంగా ఉండండి : జూపల్లి

కొండాపూర్, జూన్ 26 : మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్ అంధకారమవుతుందని, యువత వ్యసనాలు వీడి లక్ష్యం వైపు అడుగులు వేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తినివ్వాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణ, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో ఆయన మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ, అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో మందిని అదుపులోకి తీసుకుని కేసులు పెట్టినట్లు తెలిపారు. అనంతరం డ్రగ్స్ నియంత్రణపై హాజరైన అతిథులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ నివారణకై నార్కోటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిథాలీరాజ్, సుమన్, తేజ సజ్జా, నార్కోటిక్ బ్యూరో, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాంధీ దవాఖానలో కొనసాగుతున్న..

మోతీలాల్ నాయక్ నిరాహార దీక్ష

బన్సీలాల్‌పేట, జూన్ 26 : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో మూడో రోజు కూడా దీక్ష కొనసాగించారు. బుధవారం ఆయనను కె.శిరీష అలియాస్ బర్రెలక్కతోపాటు పలు జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగ సంఘాల నాయకులు పరామర్శించి, సంఘీభావం తెలిపారు. మూడు రోజుల కిందట మోతీలాల్ ఉస్మానియా యూనివర్సిటీలో దీక్ష చేపట్టగా.. ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి, గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూనే ఆయన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా.. నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తన దీక్ష కొనసాగుతుందని మోతీలాల్ నాయక్ తెలిపారు. పోలీసు బందోబస్తు మధ్య ఆయనకు వైద్య చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నదని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు తెలిపారు.

ఐఐసీటీని సందర్శించిన పాఠశాల విద్యార్థులు

సిటీబ్యూరో, జూన్ 26(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్(ఐఐసీటీ)ని పలు పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రీసెర్చ్ సెంటర్‌లో ఉన్న ప్రయోగశాలతోపాటు ఐఐసీటీ అభివృద్ధి చేసిన బయోగ్యాస్, కెమికల్, వాటర్‌కు సంబంధించిన పైలట్ ప్లాంట్స్ చూశారు. సెంటర్‌లో ఉన్న కెమికల్ ఇంజినీరింగ్, ఎనర్జీ ఎన్విరాన్‌మెంటల్ శాఖలకు చెందిన రీసెర్చ్ అంశాలు, ఐఐసీటీ ఇప్పటి వరకు సాధించిన వినూత్న ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఐసీటీకి చెందిన పరిశోధకులు రాజేంద్రరెడ్డి విద్యార్థులకు ఓరియెంటేషన్ సెషన్ నిర్వహించారు.

ప్రణీత్ ప్రణవ్ లీప్ మోసాలపై విచారణ జరిపించాలి: బీజేపీ

దుండిగల్, జూన్ 26: దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామ (వార్డు) పరిధిలో విల్లాలు నిర్మించిన ప్రణీత్ ప్రణవ్ లీప్ కన్‌స్ట్రక్షన్స్ మోసాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మల్లంపేటలోని ప్రణీత్ ప్రణవ్ లీప్ కన్‌స్ట్రక్షన్స్ గేటు ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లంపేటకు చెందిన చట్టబద్ధమైన కౌలుదారు భూములను ఫోర్జరీ డాక్యూమెంట్స్‌తో పీటీ (ప్రొటెక్టివ్ ఆఫ్ టెనెంట్) రిజిస్టర్ నుంచి తొలగించిన ప్రణీత్ ప్రణవ్ లీప్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం తమ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నదని ఆరోపించారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 121,122లో కౌలుదారుడు ఎంబరీ రాములుకు చెందిన 1.34 ఎకరాల భూమిని కాజేసిందన్నారు. ఎంబరి రాములు తన తండ్రి కాలం నుంచి సదరు భూముల్లో వ్యవసాయం చేశాడని, 2005లో వారి భూములను సదరు సంస్థకు చెందిన వ్యక్తులు లాక్కొని అన్యాయం చేశారన్నారు. ఇందుకు నిదర్శనంగా రాములుకు చదువు రాకపోయినప్పటికీ ఇంగ్లిషులో సంతకం (ఫోర్జరీ) చేసి పీటీ రిజిస్టర్ నుంచి అక్రమంగా పేరు తొలగించారన్నారు. 121, 122 సర్వే నంబర్లలోని 1.34 ఎకరాల స్థలాన్ని నలుగురు పేర్లపై తప్పుడు సేల్ డేడ్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. అందులోనే 30 విల్లాల నిర్మాణం చేపట్టడంతో పాటు పలువురికి విక్రయించిందన్నారు. ప్రస్తుతం విల్లాల కొనుగోలు చెల్లదంటూ కొనుగోలుదారులకు లీగల్ నోటీసులు అందడంతో వారు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇంత జరిగినా ప్రణీత్ ప్రణవ్ లీఫ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రణీత్ ప్రణవ్ లీప్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నాలాను సైతం కబ్జా చేసిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సర్వే నంబర్ 162, 163లోని మరో కౌలుదారు రెండు ఎకరాల పైచిలుకు భూమి ఇదే విధంగా కాజేశారని ఆరోపించారు. నిర్మాణ సంస్థ అక్రమాలపై విచారణ జరపడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకొని కౌలుదారులకు, విల్లా కొనుగోలుదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీశ్, మల్లంపేట బీజేపీ నాయకుడు ఎంబరి ఆంజనేయులు, గొల్లకృష్ణ, అరుణ్‌రావు, మల్లంపేట సోనూ, శ్రీనివాస్, బాలరాజు, కొండ శ్రీకాంత్, నవీన్, ప్రతాప్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి హత్య.. ఒకరి అరెస్టు

మల్కాజిగిరి, జూన్ 26: చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు కోసం క్యాటరింగ్ వ్యాపారిని హత్య చేసిన నిందితుడిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ కథనం ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన అన్వర్ క్యాటరింగ్ వ్యాపారి. అన్వర్ ఇంట్లో మనోజ్ రాయల్ అనే యువకుడు పనిచేస్తున్నాడు. మనోజ్ చెడు అలవాట్లకు బానిసై డబ్బు కోసం ప్రణాళికులు సిద్ధం చేసుకున్నాడు. ఈ నెల 13న అన్వర్ బంధువులు మరణించడంతో కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్‌కు వెళ్లారు. స్వగ్రామానికి కుటుంబ సభ్యులను పంపిన అన్వర్ తిరిగి ఇందిరానగర్‌లోని ఇంటికి వచ్చాడు. ఇదే అవకాశంగా భావించిన మనోజ్ రాయల్.. అన్వర్‌కు అతిగా మద్యం తాగించి తలను గోడుకు కొట్టి హత్య చేశాడు. అన్వర్ మరణించినట్లు ధ్రువీకరించుకున్న తర్వాత అతడి ఏటీఎం కార్డు, నగదు, బంగారం, ద్విచక్రవాహనం తీసుకుని పారిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఏటీఎం కార్డు ఉపయోగించి ఏటీఎం సెంటర్ నుంచి డబ్బు డ్రా చేసిన వ్యక్తి మనోజ్‌రాయల్‌గా సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి విచారించగా.. అన్వర్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఉత్తర మండలం డీసీపీ

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్

280 కిలోలు స్వాధీనం

సిటీబ్యూరో, జూన్ 26(నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న స్మగ్లింగ్ ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు చౌటుప్పల్ వద్ద అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 80.3 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి కథనం ప్రకారం.. మహారాష్ట్ర, సోలాపూర్‌కు చెందిన బోస్లే అబ మశ్చేంద్ర, అవినాశ్ శివాజీ రాథోడ్, సిద్ధా రమేశ్వర్‌పూజారి అలియాస్ సిద్ధులు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా స్నేహితులు. కాగా, సోలాపూర్‌లో గంజాయి వ్యాపారం చేస్తున్న అజయ్‌రాథోడ్ ఈ ముగ్గురికి స్నేహితుడు. కొన్నిసార్లు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాలో గంజాయిని కొనుగోలు చేసి అజయ్‌రాథోడ్‌కు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఈనెల 23న ముగ్గురు కలిసి ఒడిశాలోని అలూరి కోటకు రెండు కార్లలో వెళ్లారు. ఆ కార్లకు నకిలీ నంబర్ ప్లేట్లను అమర్చారు. తేజా అనే వ్యక్తి వద్ద 280 కిలోల గంజాయి ప్యాకెట్లు తీసుకొని.. రెండు కార్లలో మహారాష్ట్రకు విజయవాడ, సూర్యాపేట, చౌటుప్పల్, హైదరాబాద్ మీదుగా బయలుదేరారు. ఎల్బీనగర్ ఎస్ఓటీ బృందానికి ఈ సమాచారం రావడంతో మంగళవారం చౌటుప్పల్ పోలీసులతో కలిసి పంతంగి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, రెండు కార్లు, అందులోని 280 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

జలమండలి ఎండీగా అశోక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): జలమండలి నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా అశోక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.15 గంటల సమయంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి వచ్చిన అశోక్‌రెడ్డికి ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ చాంబర్‌లో ఎండీగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి నుంచి అశోక్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

అదుపులో శాంతి భద్రతలు

మియాపూర్‌లో కొనసాగుతున్న 144సెక్షన్

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): మియాపూర్‌లో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నట్లు సైబరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు. కొంతమంది స్థానికులు అక్కడున్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నించడంతో తలెత్తిన వివాదం స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా ఈ నెల 29 వరకు ఘటనా స్థలం, పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్‌ను విధించాడు. ఈ నేపథ్యంలో దాదాపు 200 మంది పోలీసు బలగాలతో మియాపూర్‌లో బందోబస్తు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బయటి వ్యక్తులెవరిని ఇక్కడకు అనుమతించడంలేదని, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం కూడా నిషేధమన్నారు. ప్రస్తుతం మియాపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్‌ను కొనసాగించాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్‌ను 2024- 25 సంవత్సరానికి గానూ యథావిధిగా కొనసాగించాలని కోరుతూ తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీడీఎల్ఎఫ్) ప్రతినిధులు బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతర కిశోర్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి తమ సమస్యలను విన్నవించింది. 135 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 1940 మంది అధ్యాపకులను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీఎల్ఎఫ్ ప్రతినిధులు భార్గవి గౌడ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బేగంపేటలో యువకుడి హత్య

ఆరుగురు నిందితుల అరెస్టు, రిమాండ్

బేగంపేట/మారేడ్‌పల్లి, జూన్ 26: బేగంపేటలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన బుధవారం బేగంపేటలో కలకలం రేపింది. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్, బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. బేగంపేట పాటిగడ్డ ప్రాంతానికి చెందిన ఉస్మాన్ (25) చేతికి దొరికిన పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఉస్మాన్ చిన్ననాటి స్నేహితుడైన ఎజాజ్ కోడలును కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. ఆ యువతి ఈ ప్రేమ వ్యవహారం కుటుంబసభ్యులకు తెలియకుండా జాగ్రత్తగా నడుచుకుంటోంది. అయితే, వారం రోజుల కిందట ఉస్మాన్ నేరుగా ఆమె ఇంటికి వెళ్లి మాట్లాడుతూ.. తాను ఆ యువతిని పెండ్లి చేసుకుంటానని చెప్పాడు. దీంతో ఆమె మామ ఎజాజ్ పలుమార్లు అతడిని హెచ్చరించాడు. యువతి తల్లిదండ్రులు ఆమెకు పెండ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయాన్ని ఉస్మాన్‌కు చెప్పినా.. ఆమెనే పెండ్లి చేసుకుంటానని మొండికేశాడు. దీంతో ఉస్మాన్ ఇటీవల యువతికి సంబంధించిన స్నాప్‌షాట్ నకిలీ ఐడీని సృష్టించి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో యువతి కుటుంబసభ్యులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఎజాజ్ తన స్నేహితులైన మహ్మద్ ఫెరోజ్, షాహిల్‌ఖాన్, మహ్మద్ ఫజల్, మహ్మద్ రషీద్, మరో బాలుడితో కలిసి ఉస్మాన్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం రాత్రి 11.40 గంటల సమయంలో ఉస్మాన్ తన సోదరితో వస్తున్నట్లు ఎజాజ్ తెలుసుకున్నాడు. పాటిగడ్డ గణపతి మండపం వద్దకు చేరుకున్న ఉస్మాన్‌ను బైక్ పైనుంచి కిందకు పడేసి.. తమ వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. అనంతరం మిగిలిన స్నేహితుల సహకారంతో కత్తితో దాడి చేయగా.. ఉస్మాన్ మృతి చెందాడు. ఉస్మాన్ సోదరి కేకలు వేయడంతో నిందితులు పారిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఉస్మాన్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకొని.. విచారణ అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు

45 రోజుల్లో ఆలోచన నుంచి ప్రోటోటైప్

టీ హబ్‌లో బ్లిట్జ్ కార్యక్రమం

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ కొత్త కార్యక్రమాన్ని బ్లిట్జ్ పేరుతో ప్రారంభించింది. కేవలం 45 రోజుల్లో ఆలోచనలను ప్రోటోటైప్‌గా మార్చడానికి టీ హబ్ ప్లగ్‌షిప్ ప్రోగ్రామ్ మొదటి విడతను చేపట్టింది. ఈ సందర్భంగా టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు మాట్లాడుతూ.. స్టార్టప్‌లను ప్రారంభించాలనే ఆలోచనల ఉన్న వారికి అవసరమైన మార్గదర్శనం ఇవ్వడంతో నిర్దిష్ట సమయంతో ఒక ఆలోచనను స్టార్టప్‌గా మార్చేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ బ్లిట్జ్ ప్రోగ్రామ్‌లో ఉంటాయని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న కొత్త టెక్నాలజీతో స్టార్టప్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉన్న వారిని ప్రోత్సహించేందుకు మొదటి విడతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

లైంగిక దాడికి యత్నం.. నిందితుడి అరెస్ట్

మన్సూరాబాద్: నాలుగేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఓ యువకుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు తమ చిన్నారి (4)తో కలిసి జీవనోపాధి కోసం నగరానికి వచ్చి ఎల్బీనగర్, గుంటి జంగయ్యనగర్ కాలనీలో ఉంటున్నారు. వీరి ఇంటి కాంపౌండ్‌లోని మరో ఇంట్లో శ్రీకాంత్ (27) ఉంటున్నాడు. అతడు జీహెచ్ఎంసీ కార్మికుడు. ఆదివారం సాయంత్రం చిన్నారి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. గుట్టుచప్పుడు కాకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్లిన అతడు చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి ఏడవడంతో తల్లి బాత్‌రూమ్ వద్దకు పరుగెత్తింది. తల్లిని తోసేసి శ్రీకాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఓం శివదుర్గా జ్యోతిష్యం



★వీరు శివదుర్గ దైవశక్తితో కేరళ సమాధి జపం సర్వమంత్ర సిద్ధి పొంది వున్నారు. అఘోర మరియు నాగసాధువులతో కలిసి సాధన పొంది వున్నారు. ఎటువంటి సమస్యలైనా 11 రోజులలో పరిష్కారం, శివం రోడ్. ఫోన్: 9866177085. NT-333815

WATER PROOFING

★సాయి బాలాజీ వాటర్ ప్రూఫింగ్: బిల్డింగ్, శ్లాబ్, బాత్‌రూం, స